సాక్షి
తూర్పుగోదావరి
గురువారం | 17 | ఏప్రిల్ | 2025



నాటి ప్రణాళిక.. నేటి ప్రయోజనం!

పేదలు విద్యకు దూరం కాకూడదనే సదుద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా చేసిన కృషి వల్ల నేడు ప్రయోజనాలు కన్పిస్తున్నాయి.


8 లో



ఏపీఎస్పీలో ఉత్సాహంగా క్రీడలు

కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో రేంజ్ - 1 పరిధిలోని నాలుగు బెటాలియన్లకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా ఆటల్లో పాల్గొంటున్నారు.

డెల్టా కాలువలకు 5,300 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 5,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,200, మధ్య డెల్టాకు 1,100, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.10 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

వివిధ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పిల్లల రక్షణ విభాగం, ప్రత్యేక దత్తత ఏజెన్సీ, చిల్డ్రన్ హోమ్ 2, వన్ స్టాప్ సెంటర్లలో పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 19వతేదీ లోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుల భర్తీకి ఈ నెల 7వ తేదీన నోటిఫికేషన్ ను జారీచే శామన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 19వ తేదీలోపు అందజేయాలని పేర్కొన్నారు.

అన్నవరంలో భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం భక్తులకు అందిస్తున్న సేవలపై ఎందుకు భక్తుల్లో అసంతృప్తి నెలకొని ఉందనే దానిపై ఇద్దరు ప్రయివేట్ వ్యక్తులతో కూడిన ఐవీఆర్ఎస్ బృందం రెండో రోజు బుధవారం కూడా అభిప్రాయ సేకరణ నిర్వహించింది. ప్రధానంగా అన్నదానం పథకంలో ఆహార పదార్థాలు రుచిగా ఉన్నాయా అని భక్తులను ఆ బృందం ప్రశ్నించింది. బాగున్నాయని చాలామంది భక్తులు చెప్పినట్టు సమాచారం. అయితే ఒకరిద్దరు మంచినీరు ఆలస్యమవుతోందని తెలిపారు. సత్యదేవుని నిత్యాన్నదానం హాలు ఫ్లోరింగ్ శుభ్రతపై ఆ బృందం అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. ఫ్లోరింగ్ శుభ్రత ఇంకా బాగుండాలని, చెప్పినట్టు తెలిసింది. దేవస్థానం టాయిలెట్స్‌లో పరిశుభ్రత పై కూడా ఆ కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసిందని సమాచారం.

వక్ఫ్ సవరణలపై నిరసన



వక్ఫ్ సవరణలకు వ్యతిరేకంగా కాకినాడలో ముస్లింలు చేపట్టిన నిరసన ర్యాలీ

కాకినాడ సిటీ: ముస్లిం మైనారిటీల హక్కులను హరిస్తున్న వక్ఫ్ సవరణలకు వ్యతిరేకంగా కాకినాడలో బుధవారం ముస్లింలు కదం తొక్కారు. వక్ఫ్ సవరణ చట్టంను రద్దు చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామని వక్ఫ్ జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు–2025ను వ్యతిరేకిస్తూ ముస్లిం వక్ఫ్ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు నగరంలో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. మొయిన్‌రోడ్డులోని జమియా మసీద్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. వక్ఫ్‌ను కాపాడండి, రాజ్యాంగాన్ని రక్షించండి అంటూ నినాదాలు చేశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ముస్లిం నాయకులు జవహర్ అలీ, తాజువుద్దీన్, అబ్దుల్ బషీరుద్దీన్, రెహమాన్, రహీం, కుతుబుద్దీన్, జిలాని దురాని, అబ్దుల్ రజాక్ రిజ్వీ, గౌస్ మొహిద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం–2025ను వ్యతిరేకిస్తున్నామన్నారు. వక్ఫ్ ఆస్తులన్నీ కూడా ఎవరో ముస్లిం దాతలు ఎప్పుడో తమ అభిష్టం ప్రకారం ముస్లిం సమాజం కోసం త్యాగం చేసి దానం చేసిన ఆస్తులే కానీ ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులు కావన్నారు.

ఏదీ ఉపాధి హామీ?

- కూలీలకు అందని వేతనాలు
- జిల్లాలో రూ.15 కోట్లకు పైగా బకాయిలు
- జనవరి నుంచీ తప్పని పస్తులు
- ఒక్కో కూలీకి సగటున రూ.20 వేల వరకు పెండింగ్
- వేతనాలు ఎప్పుడొస్తాయా అని నిరీక్షణ



చాగల్లు మండలం మార్కొండపాడులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సాక్షి, రాజమహేంద్రవరం: శ్రామికులకు ఆకలి కేకలు తప్పడం లేదు. రోజంతా స్వేదం చిందించినా ముద్ద నోటి వద్దకు రావడం లేదు. పనులు చేసి నెలలు గడుస్తున్నా వేతన బకాయిలు దరిచేరడం లేదు. ఇదీ తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కూలీల దయనీయ గాథ. వెరసి కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

ఇదీ సంగతి..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉన్న ఊళ్లోనే పని కల్పించాలన్న ఉద్దేశం నెరవేరడం లేదు. ఎర్రటి ఎండలో చెమట చిందించి పనులు చేస్తున్నా.. పస్తులు తప్పడం లేదు. రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుని శ్రమించినా సకాలంలో కూలి డబ్బులు అందడం లేదు. జనవరి మాసం నుంచి చెల్లింపులు స్తంభించడంతో బతుకుబండి లాగేందుకు ఇబ్బందిగా మారిందని ఉపాధి కూలీలు ఆవేదన చెందుతున్నారు. ఉపాధి కూలి డబ్బులు ఎప్పుడు ఇస్తారా? అని నిరీక్షిస్తున్నారు. అంతేగాక మెటీరియల్ కాంపొనెంట్ బకాయిలు సైతం విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు.

భారంగా కుటుంబ పోషణ

వేసవి కాలంలో ఉపాధి పనులకు ఆదరణ ఉంటుంది. కూలీలు ఎక్కువ శాతం పనులకు హాజరవుతారు. అందుకు అనుగుణంగా ఉపాధి పథకం అధికారులు పనులు కల్పించాల్సి ఉంది. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ 13,000 మంది వరకు ఉపాధి పనులకు హాజరవుతున్నట్లు డ్వామా అధికారులు వెల్లడిస్తున్నారు. కూలీ రోజంతా కష్టపడితే సగటున రోజువారీ కూలీ రూ.250 నుంచి రూ.300 గిట్టుబాటు అవుతోంది. ఆ డబ్బుతోనే కుటుంబాన్ని పోషించుకోవాల్సిన పరిస్థితి. ప్రతి వారం కూలీ డబ్బులు చెల్లిస్తే ఇంట్లో అవసరాలు, నిత్యావసరాలు కొనుగోలు చేసుకుంటారు. జనవరి మాసం నుంచి ఉపాధి వేతనాల చెల్లింపులు స్తంభించాయి. ప్రతి రోజూ పనులు చేస్తున్నా.. నయాపైసా తమ ఖాతాల్లో జమ కావడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. వారాల తరబడి చెల్లించకపోవడంతో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నిస్తున్నారు.

రూ.15 కోట్లు పెండింగ్

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ వేతనాల కింద రూ.15 కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కో కూలీకి సగటున సుమారు రూ.13 నుంచి రూ.20 వేల వేతనం అందాల్సి ఉంది. ఉపాధి కూలీ డబ్బులు వస్తాయని భావించి కిరాణా దుకాణాల్లో అప్పులు చేశారు. వాటిని తీర్చుకునేందుకు నానా తిప్పలు తప్పడం లేదు. ఇదేమని అధికారులను ప్రశ్నిస్తే త్వరలోనే విడుదలవుతాయని చెబుతున్నారే తప్ప.. ఎప్పుడన్నది కచ్చితంగా చెప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు.

పెండింగ్‌లో బిల్లులు

ఉపాధి హామీ పనుల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు పనులు హడావుడిగా చేపట్టారు. ప్రస్తుతం రూ.50 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అప్పులు చేసి మరీ పనులు చేపడితే, సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు.

జిల్లాలో ఉపాధి పథకం బ్లాకులు: 18
పంచాయతీలు: 300
మంజూరైన జాబ్‌కార్డులు : 1.69 లక్షలు
కూలీలు :2.61 లక్షలు
యాక్టివ్ జాబ్‌కార్డులు: 1.23 లక్షలు
పనులు వినియోగించుకుంటున్న కూలీలు: 1.76 లక్షలు

జిల్లాలో ఇలా...

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 1.69 లక్షల జాబ్‌కార్డులు మంజూరు చేశారు. అందులో 2.61 లక్షల మంది కూలీలు నమోదయ్యారు. 1.23 లక్షల జాబ్‌కార్డులకు సంబంధించి 1.76 లక్షల మంది పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. రోజుకు ఒక్కో కూలీకి సగటున రూ.254 వేతనం అందజేస్తున్నారు. 11,754 కుటుంబాలకు వంద రోజుల పని కల్పించారు. మహిళలకు 54.84 శాతం, ఎస్టీలకు 2 శాతం, ఎస్సీలకు 36.49 శాతం పనులు చూపారు. ఇప్పటి వరకు 10,003 పనులు పూర్తి చేశారు. అందులో 36.71 శాతం వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యం కల్పించారు.

15 రోజుల సమయం

జిల్లావ్యాప్తంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో 53 లక్షల పనిదినాలు కల్పించాలని డ్వామా అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 50 లక్షలకు పైగా పనిదినాలు కల్పించారు. మరో 3 లక్షల పనిదినాలు పెండింగ్‌లో ఉన్నాయి. నెల రోజుల వ్యవధిలో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. కూలీలకు వేతనం పెండింగ్‌లో ఉంది. ఈ సమయంలో పనులకు వచ్చేందుకు కూలీలు ఆసక్తి చూపడం లేదు. ఇలాంటి సమయంలో లక్ష్యసాధనపై మీమాంస నెలకొంది.

గత ప్రభుత్వ హయాంలో...

గత ప్రభుత్వ హయాంలో 2024 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులు, బిల్లుల చెల్లింపులు వేగవంతంగా జరిగాయి. కూలీలతో చేపట్టే పనులు కాకుండా.. మెటీరియల్ కాంపొనెంట్ ద్వారా పనులు నిర్వహించారు. రూ.152.13 కోట్లు వెచ్చించారు. వేతన ఖర్చుగా కూలీలకు రూ.94.49 కోట్లు, మెటీరియల్ కాంపొనెంట్‌లో భాగంగా రూ.50.50 కోట్లు ఖర్చు చేశారు. రూ.7.14 కోట్లు పరిపాలన ఖర్చుకు వెచ్చించారు.

విడుదలైన వెంటనే జమ



ఉపాధి హామీ బిల్లులు జనవరి నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. జనవరి 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన వారందరికీ వారి ఖాతాలకు జమ అయ్యాయి. తర్వాత చేసిన పనులకు అందాల్సి ఉంది. బిల్లుల పెండింగ్ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం విడుదల చేసిన వెంటనే వారి ఖాతాలకు జమ అవుతాయి.

– నాగమహేశ్వరరావు, డ్వామా పీడీ

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహకిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించి, నివారణ దిశగా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులు ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ సమాచారం ద్వారా నెలవారీ నేర సమీక్షా సమావేశం జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం జరిగింది. ఎస్పీ మాట్లాడుతూ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. గ్రేవ్ ఎక్విటల్ కేసులు, మిస్సింగ్ కేసులు, పాక్సో, ఎస్సీ ఎస్టీ కేసుల పై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. పాత నేరస్తులు, రౌడీ షీట్ హోల్డర్స్‌పై ప్రత్యేకంగా నిఘా ఉంచి వారి కదలికలు పసిగడుతూ ఉండాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించదగ్గ కేసులు ఉంటే ఆ దిశగా పనిచేయాలన్నారు. జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమీక్షలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి, జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు నేడు తుది గడువు

రాయవరం: పదో తరగతి విద్యార్హతతో సాంకేతిక విద్యకు పునాది వేసే 'పాలిసెట్' దరఖాస్తుకు గురువారం సాయంత్రంతో గడువు ముగియనుంది. ఫిబ్రవరి 27న నోటిఫికేషన్ విడుదలైన విషయం పాఠకులకు విదితమే. ఈ పరీక్ష ద్వారా రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు లభిస్తాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు తుది గడువు గురువారంతో ముగుస్తున్న నేపథ్యంలో దరఖాస్తు చేసుకోలేని విద్యార్థులు త్వరపడాలని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 4,236 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

మర్యాదాపురుషోత్తముడు రామచంద్రుడు

వాగ్దేవీ వరపుత్ర సామవేదం షణ్ముఖశర్మ



ప్రవచనాలు చెబుతున్న షణ్ముఖ శర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ''పెద్దలతో ఎలా మాట్లాడాలో మనం రాముని మాటతీరును పట్టి తెలుసుకోవాలి, ఆయన మర్యాదాపురుషోత్తముడు, వినయాది సద్గుణశోభితుడు'' అని వాగ్దేవీవరపుత్ర సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. బుధవారం టీనగర్‌లోని హిందు సమాజంలో ఆయన ఉత్తరకాండపై రెండవ రోజు ప్రవచనాన్ని కొనసాగించారు. సీతాసమేతుడయి కొలువుతీరిన రామచంద్రుని దర్శనార్థం మహర్షులు తరలి వచ్చా రు. రాక్షస పీడను తొలగించినందుకు శ్రీరాముని కొనియాడుతూ, వారు ఇంద్రజిత్తు గురించి పదేపదే ప్రస్తావించడంతో రామునిలో కుతూహలం పెరిగింది. 'మహాత్ములారా! మీరు ప్రత్యేకించి ఇంద్రజిత్తు గురించి ప్రస్తావించడానికి కారణం తెలుసుకోగోరతాను. అది రహస్యం కాకపోతే, తెలుసుకునే యోగ్యత నాకు ఉన్నదని మీరు భావిస్తే, నాకు తెలియచెప్పమని శ్రీరాముడు అడిగాడు, మునులు ఇంద్రజిత్తు తపస్సు, వాడు పొందిన వరాల గురించి చెబుతూ, వాడిని వధించడం విశేషమన్నారు. ఇక్కడ మనకు ఒక సందేహం రావచ్చు. ఇంద్రజిత్తును వధించినది లక్ష్మణుడు అయితే, రాముని ప్రశంసించడంలో ఔచిత్యమేమిటని. 'శ్రీరాముడు సత్యసంధుడు, ధర్మాత్ముడు అయితే, ఈ అస్త్రం ఇంద్రజిత్తుని వధించుగాక' అని లక్ష్మణుడు స్తోత్రం చేస్తూ ఉయోగించిన అస్త్రమే ఇంద్రజిత్తు ప్రాణాలను తీసిందని మనం విస్మరించరాదని సామవేదం అన్నారు. రామాయణంలో జ్యోతిషశాస్త్ర ప్రాశస్త్యం పలు సన్నివేశాలలో కనపడుతుంది, జ్యోతిషం వేదాంగం, ఒక ప్రామాణికమైన శాస్త్రమని సామవేదం అన్నారు. రావణుడు సీతను విందముహూర్తంలో అపహరించాడని, ఆ ముహూర్తంలో అపహరించినవాడికి ప్రాణాంతకం. అలాగే, రావణుని తల్లి కైకసి విశ్రవసుబ్రహ్మను 'దారుణ'ముహూర్తంలో సమీపించి సంతానం కోరడం వల్ల ఆమెకు లోకకంటకుడయిన రావణుడు జన్మించాడని, ఆ తరువాత పుట్టిన విభీషణుడు ధర్మాత్ముడవుతాడని ఆయన కైకసిని ఓదార్చాడని సామవేదం అన్నారు. బ్రహ్మదేవుడు ప్రత్యక్షమయినప్పుడు, 'మానవులు నాకు తృణప్రాయులు, మానవులను తప్పించి ఇతరుల చేతిలో నాకు మరణం కలగకూడదని రావణుడు కోరుకున్నాడు, ఎట్టి ఆపదలలోను నా బుద్ధి ధర్మతప్పకూడదని విభీషణుడు బ్రహ్మను కోరుకున్నాడు. బ్రహ్మదేవుడు విభీషణునికి అమరత్వాన్ని ప్రసాదించాడు, రావణుడు అదే అమరత్వాన్ని ముందు కోరితే, ఆయన ఆ వరాన్ని ప్రసాదించలేదని సామవేదం అన్నారు. భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు స్వాగత వచనాలు పలికారు.

ప్రభుత్వాసుపత్రిలో దుర్భర పరిస్థితులు

- కనీస సౌకర్యాలు లేవు, తగిన సిబ్బంది లేరు
- మాజీ ఎంపీ భరత్‌రామ్



ప్రభుత్వాస్పత్రిలో మహిళతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ భరత్‌రామ్



వీల్ చైర్‌ను తోసుకెళ్తున్న పేషెంట్ కుటుంబ సభ్యులు


కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మౌలిక సదుపాయాలు, సిబ్బంది నియామకం, పరిశుభ్రత వంటి అంశాలపై దృష్టి పెట్టాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ డిమాండ్ చేశారు. నిత్యం ఎన్నో కేసులు వచ్చే ఈ ఆసుపత్రిలో కనీస సదుపాయాలు లేకుంటే ఎలాగని ప్రశ్నించారు. బుధవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వార్డుల్లో పరిస్థితులను ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇక్కడకు వచ్చిన కేసులలో 60 శాతం విఫలమవుతున్నాయని ఆరోపించారు. ఎవరినైనా ఇక్కడ చేరిస్తే, సీరియస్‌గా ఉందని, కాకినాడ తరలిస్తున్నారని, అలాంటప్పుడు మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పుతున్న సందర్భాలున్నాయని చెప్పారు. గర్భవతులు చేరితే లేబర్ రూమ్‌కి కూడా తీసుకెళ్లడం లేదని, ఫలితంగా బెడ్ మీదే ప్రసవాలు అయిపోతున్నాయని, మంగళవారం రాత్రి కూడా ఇలాంటి ఘటన చోటు చేసుకుందని చెప్పారు. మార్చురీలో దాతలు ఇచ్చిన వెంటిలేటర్లు, ఐస్ కేసులున్నా వాడడం లేదన్నారు. తాను వస్తున్నానని తెల్సి వార్డుల్లో శుభ్రం చేయడం, కరెంట్ పునరుద్ధరించడం చేశారని చెప్పారు. ఇక్కడ ఉన్న సౌకర్యాలు ఏమిటి, డాక్టర్లు, సిబ్బంది ఉన్నారా లేదా అనే విషయాలు కూడా రివ్యూ చేయకుండా నిర్లక్ష్యంగా ఉండడం దారుణమని అన్నారు. ఆసుపత్రిలో ఉన్న ఇబ్బందులపై, సమస్యలపై వీడియోలు చేసేది రాజకీయ ప్రయోజనాల కోసం కాదని, పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడానికేనని ఆయన స్పష్టం చేశారు. జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నపుడు కరోనా సమయంలో పడిన ఇబ్బందులు గమనించి ఆసుపత్రిలో పరిస్థితులు మెరుగు పరచడం కోసం చర్యల్లో భాగంగా మెడికల్ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని భరత్ పేర్కొన్నారు. దాన్ని కొనసాగించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా ? అని ప్రశ్నించారు. వీడియో తీసిన వీరా అనే యువకుడు మాట్లాడుతూ ఒక ముసలాయన రోడ్డుపై పడివుంటే, ఆటోలో తీసుకొచ్చి చేర్చామని, స్ట్రెచర్ మీద పడుకోబెట్టి కుట్లు వేసే రూమ్‌కి తీసుకెళ్లారని, అయితే అక్కడ కూడా విద్యుత్ లేదని చెప్పాడు. 500 పడకల ఆసుపత్రి అయినందున ఇక్కడ 24గంటలూ కరెంట్ ఉండాలని, కనీసం జనరేటర్ కూడా లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు.

వర్గపోరులో డీసీసీబీ

- చైర్మన్ పీఠం కోసం నేనంటే నేను
- బీసీలకే అంటున్న టీడీపీ అధిష్టానం
- రేసులో పిల్లి సత్తిబాబు...
- మెట్ల వర్గంలో ఉలికిపాటు
- చివరి యత్నంగా చినబాబు దగ్గరకు
- జిల్లాలో పదవుల కోసం ఎదురుచూపులు



మెట్ల రమణబాబు



పిల్లి సత్తిబాబు



సాక్షి, అమలాపురం: కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులు పందేరం పుణ్యమా అని సామాజికవర్గాలు, పార్టీ నేతల మధ్య ఆధిపత్య పోరు పొడచూపుతోంది. తొలుత ఒక పేరు ప్రచారంలో ఉంచడం, చివరకు మరొకరికి పదవి కేటాయించడం టీడీపీలో కొత్త వ్యూహంగా మారింది. ప్రాథమిక సహకార సంఘాలు (పీఏసీఎస్)లకు త్రీమెన్ కమిటీ పదవుల నుంచి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ పదవి వరకు ఇదే పంథా అవలంబిస్తోంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఉన్న డీసీసీబీ, డీసీఎంఎస్ పదవులకు పేర్లను ఖరారు చేసే పనిలో టీడీపీ అధిష్టానం సిద్ధమైంది. దీనిలో డీసీసీబీ చైర్మన్ పదవి కీలకమైంది. తొలి నుంచి ఈ పదవికి అమలాపురానికి చెందిన పార్టీ నాయకుడు మెట్ల రమణబాబు పేరు ప్రముఖంగా వినిపించింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో డీసీసీబీకి నిర్వహించిన ఎన్నికల్లో రమణబాబు టీడీపీ తరఫున పోటీ చేసి అప్పటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దివంగత వరుపుల జోగిరాజు (రాజా)పై పోటీ చేసి ఓటమి చెందారు. అప్పటి నుంచి రమణబాబు ఈ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. 2014–19 మధ్య కాలంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ రమణబాబుకు ఈ పదవి కేటాయించలేదు. కేవలం గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ పదవితో సరిపెట్టారు. ఈసారి తనకు ఈ పదవి వస్తుందని రమణబాబు బలంగా నమ్మకం పెట్టుకున్నారు. పార్టీలో సైతం అతని పేరు ప్రముఖంగా వినిపించింది. కాని వారం రోజులుగా పరిస్థితి తల్లకిందులైంది. డీసీసీబీ చైర్మన్ పదవి బీసీలకు కేటాయించాలని, అందునా శెట్టిబలిజ సామాజిక వర్గానికి ఇవ్వాలనే ప్రతిపాదన తెర మీదకు వచ్చింది. దీనిలో భాగంగా కొత్తపేటకు చెందిన శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం (ఆర్ఎస్) పేరు ప్రముఖంగా వినిపించింది. దీనిపై ఆర్ఎస్‌ను పార్టీ అధిష్టానం సంప్రదించిన విషయం తెలిసిందే. క్యాబినెట్ ర్యాంకు పదవి చేసిన తాను డీసీసీబీ చైర్మన్ పదవి చేయలేనని ఆయన సున్నితంగా తిరస్కరించారు.

తెరపైకి పిల్లి సత్తిబాబు

డీసీసీబీ చైర్మన్ పదవిని ఆర్ఎస్ తిరస్కరించడంతో కాకినాడ రూరల్‌కు చెందిన పిల్లి సత్తిబాబు పేరు తెరపైకి తీసుకువచ్చారు. సత్తిబాబు సతీమణి పిల్లి అనంతలక్ష్మి ఎమ్మెల్యేగా పనిచేసిన విషయం తెలిసిందే. కూటమి పార్టీల మధ్య కుదిరిన పొత్తులలో భాగంగా కాకినాడ రూరల్ స్థానాన్ని జనసేనకు కేటాయించగా, ఆ పార్టీ తరఫున పోటీ చేసిన పంతం నానాజీ విజయం సాధించారు. జనసేనకు ఆ సీటు ఇవ్వడంతో అవకాశం కోల్పోయిన సత్తిబాబుకు సముచిత స్థానం కల్పిస్తానని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. దీనితో సత్తిబాబు ఎమ్మెల్సీ పదవిపై ఆశ పెట్టుకున్నారు. పిఠాపురం నుంచి ఈ పదవి ఆశిస్తున్న ఎస్.వి.ఎస్.ఎన్.వర్మకు ఎమ్మెల్సీ హామీ ఇచ్చి ఎన్నికల పూర్తయిన తరువాత పక్కన బెట్టడం చూసిన సత్తిబాబు డీసీసీబీ చైర్మన్ పదవి ఇచ్చినా చాలన్నట్టుగా చూస్తున్నారు. పార్టీ అధిష్టానం ఇందుకు సుముఖంగా ఉన్నట్టు తెలిసిందే.

రమణబాబు చివరి యత్నాలు

డీసీసీబీ చైర్మన్ పదవి చేజారిపోతోందని తెలియడంతో రమణబాబు చివరి యత్నాలు ప్రారంభించారు. పార్టీ అధిష్టానం వద్ద తేల్చుకునేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. దీనిలో భాగంగా ఆయన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో కలిసి పార్టీ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలవనున్నారు. డీసీసీబీ చైర్మన్ పదవి తనకు కేటాయించాలని ఆయన పట్టుబట్టనున్నారు. అయితే రమణబాబుకు నామినేటెడ్ పదవి ఇచ్చే ఉద్దేశం టీడీపీ అధిష్టానానికి లేదని పార్టీలో కొంతమంది ప్రముఖులు చెబుతున్నారు. గత సార్వత్రిక ఎన్నికలలో రమణబాబు పట్టుబట్టడంతోనే అమలాపురం అసెంబ్లీ స్థానం ఆనందరావుకు కేటాయించారు. గతంలో ఒకసారి రమణబాబుకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని పార్టీ పెద్దలు కలిశారు. 'రమణబాబు కోటాలోనే ఆనందరావుకు సీటు ఇచ్చామని, ఇద్దరు కలిసి పనిచేసుకోవాలి' అని అప్పుడు లోకేష్ అన్న మాటలను పార్టీ క్యాడర్ గుర్తు చేసుకుంటోంది. పదవిపై హామీ ఇవ్వకుండా పరోక్షంగా రమణబాబుకు నామినేటెడ్ పదవి ఇచ్చేది లేదని తేల్చినట్టుగా క్యాడర్ భావిస్తోంది.

దీనికితోడు గత ప్రభుత్వంలో మున్సిపల్ ఎన్నికలు జరిగిన సమయంలో అమలాపురం మున్సిపాలిటీ ఓసీ మహిళ రిజర్వ్ అయ్యింది. ఆ సమయంలో రమణబాబు సతీమణిని పోటీలో పెట్టాల్సిందిగా లోకేష్ సూచించారని, ఇందుకు రమణబాబు అంగీకరించలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆ ఎన్నికల్లో పట్టణంలో పార్టీ మూడవ స్థానంలో నిలిచింది. దీనిపై లోకేష్ అసంతృప్తితో ఉన్నారని సమాచారం. అయితే తూర్పు డీసీసీబీ చైర్మన్ పదవి తొలి నుంచి కాపు సామాజికవర్గానికి కేటాయించడం ఆనవాయితీగా వస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సైతం అనంత ఉదయ భాస్కర్ (అనంతబాబు), ఆకుల వీర్రాజుకు ఇచ్చిన విషయాన్ని రమణబాబు వర్గీయులు గుర్తు చేస్తున్నారు. ఈ ఆనవాయితీని కాదని బీసీలకు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్న వారు.. ఇదే విషయాన్ని లోకేష్ వద్ద తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు.

ఏపీసీఎస్ చైర్మన్ పదవుల కోసం

తూర్పు డీసీసీబీ పరిధిలో 198 సహకార సంఘాలు న్నాయి. వీటికి సంబంధించి త్రీమెన్ కమిటీల నియామకం పూర్తయ్యింది. ఇందుకు సంబంధించిన జాబితాను ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి పంపించారు. ఒకటి, రెండు చోట్ల తప్ప పెద్దగా మార్పులు ఉండే అవకాశం లేదు. గత ఫిబ్రవరిలోనే ఈ ప్రక్రియ పూర్తయ్యింది. ప్రభుత్వం నుంచి జీవో విడుదల అవుతుందనుకున్న సమయంలోనే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కావడంతో ఏపీసీఎస్ పదవుల పందేరానికి అవాంతరాలు ఏర్పడ్డాయి. ఎన్నికల ప్రక్రియ ముగిసినా పదవులకు సంబంధించిన ప్రకటన మాత్రం విడుదల కాకపోవడంతో పదవులు దక్కిన వారు ఆశగా ఎదురుతెన్నులు చూస్తున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	18,000
గటగట (వెయ్యి)	16,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



సురేష్‌బాబు (ఫైల్)

పిఠాపురం: మండలం మల్లాంకు చెందిన పల్లపు సురేష్‌బాబు (37) బుధవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇంటి దగ్గర ఎలక్ట్రికల్ పని చేస్తుండగా మోటారు బిగించే సమయంలో విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాలు కాగా అతనిని బంధువులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య మణి కొడుకు సంజయ్, కుమార్తె సరిత ఉన్నారు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటి ప్రణాళిక.. నేటి ప్రయోజనం!

- గత వైఎస్సార్ సీపీ సర్కారు చర్యలతో నేటి విద్యార్థుల విజయ సోపానాలు
- సరికొత్త రికార్డులు సాధిస్తున్న వైనం
- ఇంటర్మీడియెట్ ఫలితాలే నిదర్శనం

చేసేది ఏమిటో చేసేయి సూటిగా వేసేయి పాగా ఈ కోటలో.. ఎన్ని కష్టాలు రానీ.. నష్టాలు రానీ నీ మాట దక్కించుకో బాబయా.. అంటూ సాగే ఈ గీతంలోని ప్రతి పదం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నూటికి నూరు పాళ్లు అతికినట్టు సరిపోతుంది. పేదరికం కారణంతో ఏ పిల్లవాడూ చదువుకు దూరం కాకూడదు. కేజీ నుంచి పీజీ వరకు ఏ స్థాయిలోనూ ఏ విధమైన ఆటంకం రాకూడదు. అందుకు చేయాల్సింది ఏదైనా వెనకాడకూడదు. ఈ లక్ష్యంతో నాడు–నేడు పేరున బృహత్తర పథకాన్ని అమలు చేసిన దార్శనికుడు జగన్ మోహన్‌రెడ్డి. ఏటేటా ఫీజు రీయింబర్స్‌మెంట్. పిల్లలు పాఠశాలలకు, కళాశాలలకు వస్తున్నారా లేదా అని ఉపాధ్యాయుల ద్వారా పటిష్టమైన నిఘా. పిల్లల ఇళ్లకే వెళ్లి వాళ్ల విద్యా ప్రగతిని తల్లిదండ్రులకు వివరించడం. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో రాజీ లేని ప్రణాళికా రచన.. మానసిక ఉల్లాసానికి ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడలకు ప్రోత్సాహం. ఇలా ఎన్నో చర్యలు చేపట్టి విద్యార్థుల మనసులో కోట కట్టుకుని సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. అందుకోసం ఎన్ని కష్టాలు, నిధుల లేమి ఎదురైనా ఎలాగోలా సమకూర్చి అవసరాలన్నీ తీర్చి నిజంగానే జగన్ మామ అనిపించుకున్నారు. ఆయన నాటిన విత్తనాలు నేడు చక్కని ఫలితాలను ఇస్తుంటే విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పిఠాపురం: పరీక్షా ఫలితాలు వెలువడ్డాయంటే చాలు 1, 2, 3, 4, 5... అసాధారణ ఫలితాలు అద్భుత విజయాలు మా సొంతం అంటూ ప్రసార మాధ్యమాల్లో ప్రైవేటు విద్యా సంస్థలు ప్రచారంతో ఊదరగొడుతుంటాయి. గత కొన్నేళ్లుగా విద్యా వ్యవస్థలో ఈ పరిస్థితి నాటుకుపోయింది. ర్యాంకు రావాలంటే ప్రైవేటు విద్యా సంస్థలో తప్ప మరెక్కడా రాదని ప్రజల్లో నాటుకు పోయేలా చేశాయి ప్రైయివేటు విద్యా సంస్థలు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యత ఇస్తూ ప్రవేశ పెట్టి అమలు చేసిన పథకాలు, విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన సంస్కరణలతో ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలను మార్చివేయడంతో అలాంటి పరిస్థితిని మార్చి చూపించారు ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు. ప్రభుత్వ కళాశాలల్లో చదివి అత్యుత్తమ ఫలితాలను సొంతం చేసుకుని సత్తా చాటి ప్రైవేటు పాఠశాలలకు సవాల్ విసురుతున్నారు ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు. ఈ ఏడాది ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్రంలో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు 54 మంది అత్యుత్తమ ఫలితాలు సాధించగా వారిలో 99 శాతం మంది ప్రభుత్వ కళాశాలల విద్యార్థులే కావడం విశేషం.

మట్టిలో మాణిక్యాలు అరుదుగా బయటపడుతుంటాయి, అలాంటి మాణిక్యాలకు సాన పెడితే వాటి విలువ ఏంటో ప్రపంచానికి తెలుస్తుంది. సరైన మౌలిక వసతులు, వృత్తికి అనుకూల వాతావరణం కల్పిస్తే అద్భుత ఫలితాలు సాధ్యమవుతాయి. అలాంటి అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. గడచిన ఐదేళ్లలో నాడు–నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల తీరుతెన్నులు మారిపోవడంతో పాటు ఉపాధ్యాయులు తమ శక్తి వంచన లేకుండా తర్ఫీదు ఇస్తుండడంతో ఎన్నడూ లేని విధంగా అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు విద్యార్థులు.

ఒక్క పైసా కూడా ఖర్చు లేదు. మీకు చదవాలనే ఆసక్తి ఉంటే చాలు అన్ని వసతులు కల్పిస్తాం రండి.. చదువుకోండి.. మంచి ఉన్నత స్థానాలకు చేరుకోండి.. అంటు ప్రభుత్వ విద్యా సంస్థలు విద్యార్థులకు ఆహ్వానం పలుకుతుంటే విద్యార్థులు క్యూకడుతున్నారు. రూ.లక్షల ఫీజులు చెల్లించి చదువుకునే ప్రైవేటు కళాశాలలను తలదన్నే విధంగా ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు తమ సత్తా చాటారు. ప్రభుత్వ కళాశాల్లో మెరుగుపడిన సౌకర్యాలతో పైసా ఫీజు లేకుండా చదువుకుని టాపర్లుగా నిలిచి ప్రభుత్వ కళాశాలలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెస్తున్నారు ప్రభుత్వ కళాశాలల విద్యార్థినులు.

ఇవిగో సంస్కరణ ఫలితాలు..

మనో నేత్రమే ఆమె బలం



తుని మండలం టి.వెంకటాపురం గ్రామానికి చెందిన గింజాల హేమజ్యోతి పుట్టుకతో ఒక కన్ను పూర్తిగా కనిపించకపోయినా మసకబారినట్టు కనిపించే రెండో కన్నుతో విద్యను అభ్యసించింది. ఆమె ఇంటర్మీడియట్ ఎంఈసీలో అత్యుత్తమంగా 660 మార్కులతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ జాబితాలో స్థానం దక్కించుకుంది. తల్లిదండ్రులు శ్రీనివాసరావు, నాగ సత్యవతి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత బీఈడీ చదివి ఉపాధ్యాయురాలు కావాలన్నదే తన కుమార్తె ఆశయమని తెలిపారు.

మరింత మందికి స్ఫూర్తి



బిక్కవోలు మండలంలోని పందలపాకకు చెందిన రుత్తల లీలా శ్రావణి. విజయవాడ చెందిన ఈమె కళాశాల ఫస్ట్ రావడంతో పాటు రాష్ట్రంలో సీఈసీలో 943 మార్కులతో హైస్కూల్ ప్లస్ స్టేట్ ఫస్ట్ వచ్చింది. ఆమె చదువు మరింతమంది మహిళలకు బాట వేసింది. రూపాయి ఖర్చు లేకుండా అన్ని వసతులతో ప్రభుత్వ కళాశాలలను తీర్చి దిద్దడం వల్లే విద్యా ప్రమాణాలు పెరిగి తమ లాంటి వాళ్లు అత్యుత్తమ ఫలితాలు సాధించగలుగుతున్నామని ఆమె పేర్కొంది.

ఆటో డ్రైవర్ కుమార్తె అయినా..



కాకినాడ పీఆర్ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలకు చెందిన దుంపా సాయిలక్ష్మి ఎలక్ట్రానిక్స్ గ్రూపులో 1000కి 982 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. పేద కుటుంబానికి చెందిన ఆమె తండ్రి దుంపా ప్రసాద్ ఆటో డ్రైవరుగా పని చేస్తున్నాడు. తల్లి శేషారత్నం గృహిణి. డిగ్రీ పూర్తి చేసి గ్రూప్స్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవుతానని ఆమె తెలిపారు. విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పుల వల్ల, ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్యా భోదన వల్ల తాను మంచి మార్కులు సాధించగలిగాలని ఆమె తెలిపారు.

రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం



భావనకు ల్యాప్‌టాప్ అందసజేస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన రాపాక సహదేవుడు, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె రాపాక భావన. నిడదవోలు ప్రభుత్వ మహిళా కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్ పరీక్షలు రాసి, 974 మార్కులతో సీఈసీలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది.

నిరుపేద కుటుంబమైనా..



తల్లిదండ్రులతో కాపుగంటి సత్య రాజ్యలక్ష్మి సుధశ్రీ

పిఠాపురానికి చెందిన కాపుగంటి సత్య రాజ్యలక్ష్మి సుధశ్రీ ఒకేషనల్ కోర్సులు సెరికల్చర్ విభాగంలో 977 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమస్థానం సాధించింది. తల్లిదండ్రులు సర్వారాయుడు, సునీత నిరుపేద కుటుంబం నుంచి వచ్చినా ఆమె పట్టుదలతో చదవి అత్యుత్తమ ఫలితం సాధించింది. ప్రైవేటు కళాశాలల్లో చదువుకునే స్థోమత లేని తన లాంటి వారికి గతంలో ఎన్నడు లేని విధంగా గత ఐదేళ్లలో ప్రభుత్వ కళాశాలల రూపు రేఖలు మారి అన్ని వసతులు రావడంతో చదువులో రాణించగలిగాలని ఆమె ఆనందం వ్యక్తం చేసింది.

వసతులు, సౌకర్యాలతో లక్ష్య సాధన



రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన నక్కా శ్రావణి సత్య హెచ్‌వో (హోటల్ మేనేజ్‌మెంట్) గ్రూప్‌లో 1000/982 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. కొండగుంటూరు ప్రాంతానికి చెందిన శ్రావణి తండ్రి నక్కా చిన్న అప్పారావు రోజువారీ కూలీ. తల్లి ఆదిలక్ష్మి నర్సరీలో రోజువారీ కూలీగా పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచి కష్టపడే మనస్తత్వం ఉన్న శ్రావణి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేసిన విద్యా వసతులు, సౌకర్యాలు, స్కాలర్‌షిప్‌లతో తన లక్ష్యాన్ని అలవోకగా సాధించింది.

బాలికపై లైంగిక దాడి : కేసు నమోదు

కాకినాడ క్రైం: ఓ వ్యక్తి బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన కాకినాడలో చోటు చేసుకుంది. గోళీలపేటకు చెందిన ఓ మహిళ చేపలు విక్రయిస్తూ జీవిస్తోంది. కొన్నేళ్ల క్రితం భర్త దూరం కావడంతో లోకేష్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఈమెకు 16 ఏళ్ల కుమార్తె ఉంది. ఈ నెల 11వ తేదీన మహిళ ఇంట్లో లేని సమయంలో ఆమె కుమార్తెపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ విషయాన్ని ఆ కుమార్తె తన తల్లికి తెలపగా ఆమె బుధవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీఎస్పీలో ఉత్సాహంగా క్రీడలు

- రెండో రోజు హోరాహోరీగా పోటీ
- నేటి సాయంత్రం ముగింపోత్సవం



ఏపీఎస్పీ బెటాలియన్‌లో కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

కాకినాడ రూరల్: కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో రేంజ్ – 1 పరిధిలోని నాలుగు బెటాలియన్లకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా ఆటల్లో పాల్గొంటున్నారు. బుధవారం పరుగు పందెం పోటీలు, హైజంప్, కబడ్డీ, క్రికెట్, టగ్ ఆఫ్ వార్, తదితర పోటీలను నిర్వహించారు. మూడు రోజులు పాటు జరగనున్న పోటీలు గురువారం సాయంత్రంతో ముగియనున్నాయి. పోటీలలో ఏపీఎస్పీ కాకినాడ 3వ బెటాలియన్‌తో పాటు విజయనగరం, విశాఖపట్నం, మంగళగిరి బెటాలియన్ల క్రీడాకారులు పాల్గొంటున్నారు. ముగింపు కార్యక్రమంలో బెటాలియన్ల ఐజీ రాజకుమారి, డీఐజీ ఫక్కీరప్ప తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు.

రెండో రోజు విజేతలు వీరే

హైజంప్ విభాగంలో 5వ బెటాలియన్‌కు చెందిన పి.ప్రసాదరావు, 16వ బెటాలియన్‌కు చెందిన వి.సుధాకర్, వి.శ్రీను ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. 1500 మీటర్ల పరుగు పోటీలో తొలి మూడు స్థానాలలో 5వ బెటాలియన్‌కు చెందిన సురేష్‌కుమార్, 16వ బెటాలియన్‌కు చెందిన కె.రాజానాయుడు, 5వ బెటాలియన్‌కు చెందిన పి.సత్యారావు, చెస్ విభాగంలో 16వ బెటాలియన్‌కు చెందిన శివకుమార్ విన్నర్‌గాను, 6వ బెటాలియన్‌కు చెందిన శ్రీను రన్నర్‌గా నిలిచారు. కబడ్డీ విభాగంలో 16వ బెటాలియన్ విన్నర్‌గాను, 5వ బెటాలియన్ రన్నర్‌గా నిలిచారు. క్రికెట్ విభాగంలో 3వ బెటాలియన్ విన్నర్‌గాను, 5వ బెటాలియన్ రన్నర్‌గా నిలిచారు, 200 మీటర్ల విభాగంలో 5వ బెటాలియన్‌కు చెందిన ఎస్.శివకుమార్, 16వ బెటాలియన్‌కు చెందిన జి.శ్రీను, జి.మురళీ విజేతలుగా నిలిచారు. 5వేల మీటర్ల పరుగు విభాగంలో 5వ బెటాలియన్‌కు చెందిన ఎస్.శివకుమార్, వై.సత్యారావు, 16వ బెటాలియన్‌కు చెందిన రాజినాయుడు విజేతలుగా నిలిచారు. మారథాన్‌లో 5వ బెటాలియన్‌కు చెందిన ఎం.లక్ష్మణ్, టి.శ్రీనివాసరావు విజేతలుగా నిలిచారు.



హైజంప్ చేస్తున్న క్రీడాకారుడు



విజయం కోసం పరుగో పరుగు

క్షేత్రస్థాయి నివేదిక మేరకు నిర్ణయం



అంతర్వేది ఆలయం వద్ద ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న దేవస్థానం కౌలు రైతులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భూములకు సంబంధించి క్షేత్రస్థాయి నివేదిక ఆధారంగా వచ్చే డేటాతో తదుపరి సమావేశం నిర్వహిస్తామని అమలాపురం ఆర్డీఓ కె.మాధవి అన్నారు. బుధవారం అంతర్వేది ఆలయ ప్రాంగణంలో మండలంలోని వివిధ గ్రామాల్లో స్వామివారి దేవస్థానం భూముల శిస్తుల పెంపుదల నిమిత్తం ఏర్పాటు చేసిన అధికార సమావేశం రైతుల హాజరు శాతం తక్కువగా ఉండడం వల్ల వాయిదా వేశారు. దీంతో గ్రౌండ్ లెవెల్‌లో రెవెన్యూ, అగ్రికల్చర్, ఫిషరీస్ సిబ్బంది దేవస్థానం భూములపై ఇచ్చే వాస్తవ పరిస్థిల డేటాపై తదుపరి సమావేశం నిర్వహణకు ఆర్డీఓ పై విధంగా తెలిపారు. సదరు సమావేశానికి రైతులు శాతం సంతృప్తికరంగా ఉండాలని కూడా ఆర్డీఓ ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా దేవస్థానం కౌలు రైతులు ఒక వినతి పత్రాన్ని ఆర్డీఓకు అందజేశారు. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా ధ్వంసం కావడం వల్ల, మరో పక్క చెరువుల వల్ల వచ్చే వ్యర్థమైన నీటి వల్ల దేవస్థానం భూముల్లో వ్యవసాయం దెబ్బతిందని, గత 12 సంవత్సరాలుగా కనీసం పంట ఊడ్చలేని పరిస్థితులు ఏర్పడ్డాయని, వ్యవసాయ భూములు తరుచూ ముంపులోనే మునిగి ఉంటున్నాయని ఆ పత్రంలో వారు వివరించారు. గ్రౌండ్ లెవెల్‌లో వాస్తవ పరిస్థితులు అంచనా వేసి, తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ–1 కొల్లాబత్తుల శుభాకర్, ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, మాలే శ్రీనివాస నగేష్, దేవ రాజేంద్రప్రసాద్, ఉండపల్లి అంజిబాబు, పలువురు వీఆర్వోలు, వివిధ గ్రామాలకు చెందిన కౌలు రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన యువకుడి అరెస్టు

శంఖవరం: గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులు దండ వేసిన యువకుడిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. డీఎస్పీ శ్రీహరిరాజు అందించిన వివరాల మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన యువకుడు శంఖవరం గ్రామానికి చెందిన పడాల వాసుగా పోలీసులు గుర్తించారు. ఈ నెల 14 అర్ధరాత్రి దాటిన తరువాత వాసు అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానం కలిగించినట్లుగా పోలీసులు గుర్తించారు. దళితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే రోజున అన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు పోలీసులు కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఛేదించారు. అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, డీఎస్పీ, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలు, 40 మంది పోలీసులు ప్రత్యేక బృందాలుగా విచారణ చేపట్టారు. ఈ కేసులో సాంకేతిక, సీసీ ఫుటేజీల ఆధారంగా అనేక మంది అనుమానితులను విచారించి నిందితుడిని గుర్తించారు. నిందితుడు ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. అతడు దుందుడుకు స్వభావంతో ఈ దారుణానికి ఒడిగటినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో నిందితునికి కఠిన శిక్ష పడేందుకు మరిన్ని సాంకేతిక ఆధారాలతో లోతైన దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అన్నవరం డ్రైవర్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

అన్నవరం: అన్నవరం దేవస్థానం ట్రాన్స్‌పోర్టు విభాగంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న కొల్లు పైడిబాబు (పెద్ద శ్రీను)ను 'బ్రీత్ అనలైజర్' పరీక్షలో మద్యం తాగినట్టు గుర్తించి తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. తదుపరి చర్యల కోసం ఈఓకు నివేదిక సమర్పించినట్టు అధికారులు తెలిపారు.

బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

రాయవరం: స్థానికంగా 11 ఏళ్ల బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన తేతల వెంకట శ్రీనివాస్‌రెడ్డి అలియాస్ కేబుల్ శ్రీనుపై ఎస్సై డి.సురేష్‌బాబు కేసు నమోదు చేశారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రాయవరం మెయిన్‌రోడ్డులో అరెస్టు చేశామన్నారు. అనంతరం జేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



మృతుడు వీరబాబు (ఫైల్)



సంఘటనా స్థలంలో రోడ్డుపై బైఠాయించిన వీరబాబు కుటుంబ సభ్యులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వెంకటనగరంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటనా స్థలంలో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేయడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రత్తిపాడు పోలీసులు అందించిన సమాచారం మేరకు మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములు నందవరపు వీరబాబు (20), నందవరపు కృష్ణ బైక్‌పై కొత్తూరు (యూజీ పురం) వెళ్లి వివాహ వేడుకలో పాల్గొని తిరిగి ఇంటికి వెళ్తున్నారు. మార్గం మధ్యలో వెంకటనగరం చెరువు సమీపంలోని కోళ్ల ఫారం వద్ద యూజీ పురం వైపు వెళ్తున్న బోర్ వెల్ వాహనం బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నందవరపు వీరబాబు (20) తలకి తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కుర్చున్న నందవరపు కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. కృష్ణను 108 వాహనంలో ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి ప్రథమ చికిత్స అందించి అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి గురైన అన్నదమ్ములు నందవరపు రాము, బైరాగి కుమారులు. బాధిత కుటుంబ సభ్యులు సంఘటనా స్థలంలో రోడ్డు బైఠాయించి ఆందోళన చేయడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. నందవరపు రాము దంపతుల కుమారుడు వీరబాబు వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబానికి అండగా ఉండేవాడు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. గ్రామంలో నిత్యం చలాకీగా తిరిగే వీరబాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో చింతలూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రత్తిపాడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్రిస్టియన్ బృంద సంగీతంలో భవాని గిన్నిస్ రికార్డ్

కరప: మండలం వేళంగి గ్రామానికి చెందిన టెక్కలి వీరకన్య భవాని (పల్లవి) క్రిస్టియన్ బృంద సంగీతంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించింది. సంగీతాభ్యాసంలో పాస్టర్ అగస్టిన్ ఇచ్చిన ఉచిత శిక్షణలో అగ్రగామిగా ఉన్న భవాని విజయవాడలోని హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొంది. అగస్టిన్ దండంగి వేణుగోపాల్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒక గంట వ్యవధిలో అత్యధికంగా 1046 పియానో వాయిద్య ప్రదర్శన వీడియోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా ఆమె ప్రపంచ రికార్డ్ నెలకొల్పింది. ఈ మేరకు హైదరాబాద్‌లో ఈనెల 14వ తేదీన నిర్వహించిన కార్యక్రమంలో బ్రదర్ అనిల్‌కుమార్, అగస్టిన్ వేణుగోపాల్ తనకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ పార్టిస్‌పేషన్ సర్టిఫికెట్ అందజేసినట్టు భవాని బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు.



భవాని అందుకున్న గిన్నిస్ వరల్డ్ రికార్డ్



హైదరాబాద్‌లో బ్రదర్ అనిల్‌కుమార్ నుంచి గిన్నిస్ రికార్డ్ పత్రం తీసుకుంటున్న భవాని